Aulaad ki Tarbiyat
(Telugu)

సంతానానికి శిక్షణ

మూలం
ఎమ్.ఎమ్.ఐ.పి.

అబ్బాదుల్లా

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

సంతానానికి శిక్షణ

తర్‌బియత్ (శిక్షణ) ఒక అరబీ పదం, దీని అర్థం పెంచడం, అభివృద్ధిపరచడం. వ్యక్తిని ఒక ప్రత్యేక విధానంలో అభివృద్ధి పరచడాన్ని తర్‌బియత్ అంటారు. ఆంగ్లంలో ట్రయినింగ్ అని, తెలుగులో శిక్షణ అనే పదాన్ని మనం వాడడం జరుగుతుంది.

'దీని తర్బియత్' అంటే ధార్మిక శిక్షణ. దీని పరిపూర్ణ భావం ఏమిటంటే బుద్ధీవికాసాలను, శారీరక సౌష్టవాన్ని వికసింపజేసి ఒక మంచి మానవునిగా తయారు చేయడం, ఇహ జీవితంలో విజయోన్ముఖుడయ్యేలా చేయడం మరణానంతరం సంభవించే పరలోక శాశ్వత జీవితంలో కృతకృత్యుడై స్వర్గసుఖాలకు అర్హుడయ్యేలా జేయడం.

ఇస్లామీ తర్బియత్ (ఇస్లామి శిక్షణ) లక్ష్యం వ్యక్తి జీవితరంగాలలో నిపుణత సముపార్జించడం, మంచి పౌరుడుగా తయారవడం, లేదా ఒక స్పెషలిస్టుగా పేరుపొందడం మాత్రమే కాదు, వీటన్నిటికి మించిన ఉత్తమోత్తమ వ్యక్తిగా రూపొందడం. ఒక మానవుడి పెద్ద ప్రత్యేకత శ్రేష్టమైన మానవుడు కావడమే. మానవ లక్ష్యం అవుతుంది. దైవం మానవుణ్ణి మంచి నైపుణ్యతతో సృష్టించాడు, ఒక పరిపక్వమైన సంపూర్ణమైన వ్యక్తిగా తయారు చేయడానికీ మానవుణ్ణి సృష్టించానని దివ్యగ్రంధంలో చెప్పడమయింది.

"మేము మానవుణ్ణి ఉత్తమోత్తమ రూపు రేఖలతో సృష్టించాం."

మరో సందర్భంలో ఇలా చెప్పబడింది:

ఓ మానవుడా! నిన్నే విషయం పరమదయాళువైన ప్రభువునుండి

మోసం చేస్తూంది. ఆయనే నిన్ను సృష్టించాడు, సర్వావయాలతో తీర్చిదిద్దాడు ఒక సమన్వయంతో పుట్టుకనిచ్చాడు.

అనేక సందర్భాలలో మానవ సృష్టిని గూర్చి తెలుపుతు మానవుడు పరిపూర్ణ రూపంలో ఒక లక్ష్యసాధనకోసం సృష్టించబడ్డాడని తెలుపడమైంది. మనిషికి అధికారం ఇవ్వబడింది, సంరక్షకుని బాధ్యత ఇవ్వబడింది. సృష్టి ఉద్దేశ్యం పరలోకవిజయం. మానవుని కృతార్థత నిరంతర దైవదాస్య నిర్వహణపై ఆధారపడి ఉందని తెలుస్తుంది. అంతకు మినహా ఏదీ లేదు. మానవుని శిక్షణ ఉద్దేశ్యం ఏమిటంటే అతని ఆధ్యాత్మికతలో కానీ శారీరక ఎదుగుదలలో కానీ, ధార్మికతలో కానీ మనిషి పూర్తిగా ఒక పరిపూర్ణమైన దైవ దాసుడు కావాలి, ఇహలోకంలో విజయవంతంగా జీవితంగడపి పరలోక జీవితంలో కూడ విజయోన్ముఖుడు కావాలి. అసలు విజయం పరలోక జీవిత కృతార్థతయే.

శిక్షణ విషయంలో అన్నిటికంటె ప్రముఖమయింది సంతానపు శిక్షణ. ఇది మానవుని బాధ్యతలలో విధిగా నిర్వహించాల్సిన బాధ్యత. కాస్త ఆలోచించి చూస్తే సంతానమనేది మానవునికి ఒక గొప్ప ప్రసాదం, గౌరవప్రదం కూడ. అంతేకాదు మనిషి ఇహపరాల జీవితాన్ని జయప్రదం చేసేది సంతానమే. అందులోనే మానవ శ్రేయం ఉంది. సంతానం సామాజిక అవసరం కూడ. పిల్లలు కలుగడం మానవళి జాతి పెరగడానికి, నిరంతర జీవిత వ్యాప్తికి అవసరం.

ప్రపంచం దృష్ట్యా చూస్తే సంతానం తల్లిదండ్రుల కన్నుల పండుగ. దుఃఖ సమయాల్లో తల్లిదండ్రులను వారు ఆదుకొంటారు. మానవుల్ని పరిచయం చేసేది పుత్ర పౌత్ర సంతానమే. సంతానం వల్ల మానవుడికి బలం చేకూరుతుంది, ఔన్నత్యం లభిస్తుంది. సంతానం ఉండడం వల్లనే మానవుడు ప్రపంచంలో కష్టపడి కృషి చేయడానికి సంకల్పిస్తాడు. సంతానం మనిషిలో ప్రేరణ కల్గిస్తుంది, అతను లక్ష్య సాధనకు ఉద్యమిస్తాడు. సంతానం ప్రపంచంలో మనిషికి శోభనిస్తుంది. అతణ్ణి శిఖరాగ్రాలకు తీసికెళ్ళుతుంది.

దైవం మనిషికిచ్చిన గొప్ప అనుగ్రహం సంతానమే. ఒక కుటుంబం సంతానం పట్ల కేంద్రీకరించి ఉంటుంది. సంతానం కుటుంబంలోని పెద్దలకు కన్నుల పండువుగా ఉంటుంది. వికసించిన పుష్పాల వలే కొడు కులు కూతుళ్ళు తల్లి దండ్రుల సమక్షంలో ఉంటారు. సంతానం కుటుంబ వ్యవస్థను తరతరాలవరకు సజీవ పరుస్తుంది. దంపతుల మధ్య ప్రేమ, ఉత్సాహం పెరగడానికి సంతానం ప్రగాఢంగ తోడ్పడుతుంది. సంతానం వల్లనే వివిధ కుటుంబాల మధ్య సంబంధాలు పెరిగి బంధుత్వ సంబంధాలు ఏర్పడుతాయి. సమాజం వ్యాప్తిలోకి రావడం జరుగుతుంది. సంతానం వల్ల చేకూరే ప్రయోజనాలను దివ్యఖుర్ఆన్ హితవులు, మహాప్రవక్త ఆదేశాలు తెలియపరుస్తున్నాయి. ఆ ప్రయోజనాలు దైవ కృపాదరణలని వేరే చెప్పనవసరంలేదు. దివ్యఖుర్ఆన్‌లో ఇలా చెప్ప బడింది.

"మీకు సిరిసంపదలను, సంతానాన్ని ప్రసాదిస్తాడు" (నూహ్ : 12)

మహాప్రవక్త(సఅసం) ఒక ప్రవచనంలో కుమారుని గురించి హృద యపు ఫలమని, మరో ప్రవచనంలో కుమార్తెను గురించి శుభం సమృద్ధి అని తెలుపడమయింది.

దివ్యఖుర్ఆన్‌లో సంతాన ప్రస్తావన వచ్చిన సందర్భంలో వారి రాక శుభవార్తగ తెలియజేయడమయింది.

"జకరియ్యా! మేము నీకు యహ్యా అనే పేరుగల ఒక కుమారుని శుభవార్తను తెలియజేస్తున్నాము." *(మర్యమ్-7)*

"మేము ఆమెకు ఇస్హాఖ్ శుభవార్తనూ, ఇస్హాఖ్ తరువాత యాఖూబ్ శుభవార్తను అందజేశాము." *(హూద్-71)*

"మేము అతనికి ఒక సహనశీలుడైన కుమారుడు కలుగుతాడనే శభవార్తను అందజేశాము." ***(అస్సఫాత్-101)***

అరబ్బు సమాజంలో కుమార్తె జననం పట్ల అసహ్యించుకొనేవారు, దుఃఖపడేవారు. కాని కుమార్తె జననాన్ని శుభవార్తగా తెలుపుతుంది దివ్య ఖుర్ఆన్.

వారిలో ఎవడికైన కూతురు పుట్టిందనే శుభవార్తను అందజేస్తే అతడి ముఖాన్ని నల్లని ఛాయలు ఆవరిస్తాయి. అతడు లోలోన కుమిలిపోతాడు. *(అన్ నహ్లా - 58)*

ఇస్లాం సంతానం పట్ల ఆసక్తి కల్గిస్తుంది, కలిగిన సంతానానికి శిక్షణ ఇవ్వమంటుంది. ప్రవక్తలు కూడ తమ సంతానం గురించి ఈ విధంగ ప్రార్థనలు చేశారు.

"ఓ ప్రభూ! మా ఇరువురిని నీకు సంపూర్ణ విధేయులై ఉండే విధంగ చేయి. మా సంతానం నుండి నీకు విధేయులై ప్రవర్తించే జాతిని ఉద్భవింప చేయి. ఆరాధించే విధానాలను తెలియపరుచు, మా తప్పులను మన్నించి క్షమించు."

ఇహలోక జీవితంలోనే కాదు, పరలోకంలో కూడ సంతానం వల్ల ప్రయోజనాలు, లాభాలు కలుగుతాయని దివ్యఖుర్ఆన్, ప్రవక్త ప్రవచనాలలో అనేక పర్యాయాలు చెప్పబడింది. తల్లిదండ్రుల స్వర్గ ప్రవేశం సంతానం వల్ల సుగమం అవుతుందని వాటి వల్ల ఇట్టే తెలుస్తుంది. ఏ వ్యక్తి అయినా సరే సంతానాన్ని పెంచి పోషించడానికి చేసే కృషి, వారి అవసరాలను తీర్చేందుకు చేసే కష్టంలో ప్రతిదానికి దైవం ప్రతిఫలాన్ని ఆ వ్యక్తికి ప్రసాదిస్తాడు. సంతానానికి సుశిక్షణ ఇవ్వడానికి చేసే ప్రతి ప్రయత్నం తల్లిదండ్రుల సుగుణాలలో లెక్కించబడుతుంది. తల్లిదండ్రులలో ఏ ఒక్కరు స్వర్గస్తులైన సరే వారి పరలోక శ్రేయం కోసం సంతానం చేసే ప్రార్థనలు, వారి కోసం వేడుకొనే క్షమాపణలు అల్లాహ్ అంగీకరిస్తాడు, మరణించిన వ్యక్తిని పావన పరుస్తాడు. ఒక హదీసులో ఇలా తెలుపబడింది.

"ఒక వ్యక్తి మరణంతో అతడు చేసిన పనులన్ని అతని నుండి విడదీయబడుతాయి. కాని మూడు పనులు మాత్రం ఆ వ్యక్తితోనే కొన సాగుతాయి. మొదటిది నిరంతరం ఉండేట్లు అతడు చేసిన దానధర్మాలు, రెండవది ప్రజలు లాభపడేట్లు వ్యాపింపజేసిన విద్య, మూడవది అతని కోసం సంతానం చేసే ప్రార్థనలు"

మరోహదీసులో ఇలా ఉంది: (ఇబ్నెమాజ)

(ఏదో ఒక సమయంలో) వ్యక్తి స్థాయి ఉన్నతమౌతుంది. ఆవ్యక్తి దైవంతో ఇలా అంటాడు. ప్రభూ నా స్థాయి ఎలా ఉన్నతమయింది. దైవం వ్యక్తితో ఇలా అంటాడు. నీ తరువాత నీ తనయుడు నీ కోసం క్షమాభిక్ష కోరుతూ ప్రార్ధించడమయింది, దానివల్ల నీ స్థాయి ఉన్నతమయిందన్నాడు ప్రభువు.

ఒక వ్యక్తి సంతానానికి శిక్షణ ఇచ్చినట్లైతే దాని ప్రతిఫలం కూడ ఆవ్యక్తికి లభిస్తుంది. ఈ విషయ ప్రస్తావన చేస్తూ మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా అన్నారు.*(ముస్లిం)*

ఒక వ్యక్తి ఇద్దరు కుమార్తెలను పెంచి, పోషించి వారిని యౌవనదశ వరకు రక్షించాడంటే తీర్పు దినాన వారు మరియు నేను (తన చేతి వేళ్ళను కలిపి చూపిస్తూ)ఇలా వస్తామని సెలవిచ్చారు.

సంతానం పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండడం కూడ పుణ్యకార్యమే అని సెలవిచ్చారు మహా ప్రవక్త (సఅసం).

మహాప్రవక్త (సఅసం) ఇలా అన్నారు. "ఏ వ్యక్తి తన కూతుళ్ళ వల్ల పరీక్షింపబడుతాడో, వారిపట్ల సత్ప్రవర్తన ప్రదర్శిస్తాడో, ఆ ప్రవర్తన ఆ వ్యక్తిని నరకాగ్ని నుండి కాపాడుతుంది"

సంతానం కోసం ధనం వ్యయం చేయడం కూడ పుణ్యఫలదాయకం. దివ్యఖుర్ఆన్‌లో ఇలా చెప్పబడింది. వ్యక్తి తన సంతానాని కోసం ధనం వ్యయపరుస్తాడు. ఆ వ్యయం మరణానంతర జీవితంలో ఒక నిధిగా ఉంటుంది. ప్రవక్త (సఅసం) ప్రవచనాలలో అనేక చోట్ల ఈ విషయం తెలుపబడింది. దాని గొప్పతనం కూడ విశదీకరించబడింది. ఒక హదీసులో ఇలా ఉంది. (ముస్లిం)

తన సంతానం కోసం ఖర్చుపెట్టే ధనమే అన్నింటికంటే శ్రేష్టం.

మరో మహాప్రవక్త ప్రవచనం. తన సంతానం కోసం ఒక వ్యక్తి ఖర్చు

చేస్తే, దాని ద్వారా దైవ ప్రసన్నత కోరితే ఆ వ్యయం అతని కోసం దాన ధర్మంగా అంగీకరించబడుతుంది.

ఒక వ్యక్తి సంతానం కోసం డబ్బు ఖర్చు చేస్తూ సంతానం మధ్య భేద భావం చూపరాదు. అంటే ఒకరికి ఎక్కువ మరొకరికి తక్కువ కాకుండ చూడాలి. ఉదాహరణకు కొడుకు కూతురుల మధ్య తారతమ్యం చూపరాదు, ఇద్దరికి సమాన దృష్టితో ఖర్చుచేయాలి. ఇటువంటి వ్యయం తల్లిదండ్రుల స్వర్గ ప్రవేశానికి దారి సుగమం చేస్తుంది.

ప్రవక్త (సఅసం) ప్రవచనం ఇలా ఉంది; ఎవరికైన ఆడ సంతానం కలిగితే ఆమెను సజీవసమాధి చేయకుండా, ఆమె పుట్టుక అవమానకరంగ భావించక, కుమార్తెకన్నా కుమారులు ఉన్నతంగా చూడనట్లయితే అతనికి దైవం స్వర్గప్రవేశాన్ని కల్పిస్తాడు.

బుఖారి, ముస్లింలలో ఉల్లేఖించిన మరో హదీసులో (కొడుకు కూతురు) సంతానం పట్ల న్యాయం చేయని తీవ్రహెచ్చరిక ఇవ్వబడింది. న్యాయం చేయకపోవడం దౌర్జన్యమౌతుందని చెప్పారు మహాప్రవక్త (సఅసం).

శైశవంలోనే ఎవరి సంతానమైన మరణిస్తే అటువంటి తల్లిదండ్రులు గౌరవప్రదాతలుగా చూడబడ్తారు. హదీసులో ఇలా చెప్పబడింది;

(బుఖారి, ముస్లిం)

ఒక ముస్లిం యుక్త వయస్సుకు రాని ముగ్గురు శిశువులు మరణిస్తే అతనికి దైవం స్వర్గప్రవేశం కల్పిస్తాడు. ఇలాంటి అర్థాన్నిచ్చే మహా ప్రవక్త (సఅసం) ప్రవచనాలు ఇంకా ఉన్నాయి. మరో హదీసులో ముగ్గురు శిశువులకు బదులు ఇద్దరు శిశువుల ప్రస్తావన ఉంది.

(బుఖారీ, ముస్లిం 2633)

వాస్తవంగా పరిశీలిస్తే సంతానం ధార్మికంగా, ప్రాపంచికంగా తల్లి దండ్రులకు ఇవ్వబడిన వరప్రసాదం, అమూల్యమైన బహుమానం కూడ. అటువంటి సంతానానికి విద్యాబుద్ధులు నేర్పించి సుశిక్షితులుగా చేయడమనే

బాధ్యత ఒక ఆరాధన అవుతుంది. సంతానానికి ఇచ్చే ట్రయినింగ్, ఈ బాధ్యత నిర్వహణలో కలిగే ఇబ్బందులు కష్టాలు అన్నీ పరలోకంలో మనకు అండగా నిలిచే పెట్టుబడులుగా తోడ్పడతాయి. జీవితంలోని ప్రతి వ్యవహారంలో, నాగరికత విషయాలలో, ధార్మిక విధానాలలో సంతానం మనకు దోహదపడుతుంది. అందుచేత వారిని సుశిక్షితులుగా చేయడం మనకు ఇతోధికంగ లాభదాయకమవుతుంది. సంతానం ఒక గొప్ప దైవ ప్రసాదం, దానికి మించిన మరో ప్రసాదం లేదు. ఏ వ్యక్తికి మరణానంతర జీవితవిజయం లక్ష్యమౌతుందో ఆ లక్ష్యసాధనకు సంతానం మార్గమౌతుంది. ఈ మార్గంలో వ్యక్తి తనకివ్వబడిన అపార అర్హతలు, శక్తి సామర్థ్యాలను వాడేందుకు అవకాశముంది.

మన సమాజంలో ఉన్న నేటి పరిస్థితి చూడండి. సంతానం కలుగకుండ, కలిగినా పరిమిత కుటుంబం పేరిట ఒకరిద్దరి సంతానంతో ఆపుకోవడం లాంటి ప్రక్రియ చూస్తున్నాం.

ఈ భావాలకు, అలవాట్లకు గురైన ముస్లిం కుటుంబాలు ఏవేవో అభిప్రాయాలు ప్రకటిస్తుంటాయి. ఎంతమంది బిడ్డలకు స్టాండర్డు ట్రయినింగు ఇవ్వగలమో అంతమంది బిడ్డల్నే కనాలి. అంతకంటె ఎక్కువ సంతానం ఉండరాదు అని తలుస్తారు చీమలు, పురుగుల్లా సంతానం ఉంటే ఎలా! దానివల్ల ఏం లాభం? అని వాపోవడం మూర్ఖత్వానికి నిదర్శనం. ఉన్నత స్థాయికి ఎదగడంవారు ఆశిస్తారు. వారివద్ద ప్రపంచంలో ధనార్జన తప్ప మరే ఉద్దేశ్యం ఉండదు. వారి శిక్షణ ఎలా ఉంటుందో అలాగే వారి కార్యాచరణ ఉంటుంది. ఇహలోక తాపత్రయాలకు దాసోహం పలుకడం వారి లక్షణం. ప్రపంచాన్ని వదిలి మరో విషయంపై దృష్టి సారించడంగాని, ఆలోచన చెయ్యడం గాని వారికి ఉండదు. ఆ పనికి వారి వద్ద సమయం కూడ ఉండదు.

ఒక మాట మరువకండి, ఇస్లాం ఆదేశించే పనులన్నిటిలో పరలోక తలంపు ఉంటుంది. పరలోక విజయమే అసలు విజయమని ఘోషిస్తుంది. సంతానం ఈ ప్రపంచంలో ప్రగతి సాధించాలనే తల్లిదండ్రుల తలంపు మంచి

కోరికగా భావిస్తుంది. కాని అదేవారి లక్ష్యంకాదు. ప్రతి వ్యక్తి సంతానం కోసం తనపై మోపబడిన బాధ్యతల్ని సక్రమంగ నిర్వహిస్తూ పరలోక జీవితాన్ని లక్ష్యం చేసుకోవాలి. అప్పుడే అతని వ్యయం, కార్యనిర్వహణ, అన్ని సఫలీకృత మౌతాయి. పరలోక కృతార్థతయే అసలైన సాఫల్యం. అందుచేత సంతానానికి ఒకే ప్రత్యేకతకల నైపుణ్యం ప్రసాదించాలనే ఉద్దేశ్యం ఉంటే చాలదు. అనేక రుగ్మతలు, బలహీనతలు కల సంతానానికి చేసే సేవకూడ ప్రతిఫలాన్ని సమకూర్చుతుంది.

ప్రాముఖ్యం

మనిషికి దైవం ప్రసాదించిన మహానుగ్రహం బిడ్డలు. ఈ మహాను గ్రహం పొందిన తల్లి దండ్రుల కర్తవ్యం వారిని సుశిక్షితులుగా చెయ్యడం. సంతానానికి విద్యా బుద్ధులు చెప్పించకపోవడం, ఒక మహోపద్రవాన్ని ఆహ్వానించడమవుతుంది. మరణానంతర జీవితంలో ఇలాంటి ఉపేక్షపట్ల ప్రశ్నించబడుతుంది, శిక్షించబడడం కూడ జరుగుతుంది.

దైవప్రవక్త (సఅసం) ఇలా చెప్పారు. మనిషి తన పై మోపబడిన బాధ్యతల్ని నిర్వహించడంలో నిర్లక్ష్యం చేయరాదు ఇదొక గొప్ప బాధ్యత. ఈ జవాబుదారితనం నుండి ఎవరు తప్పించుకోలేరు.

మహా ప్రవక్త సంతానానికి ఇచ్చే సుశిక్షణ విషయం ప్రస్తావిస్తూ ఈ బాధ్యతను ఏ వ్యక్తి విస్మరించరాదు. సంతానపు మూర్తిత్వాన్ని (Personality) మలచడంలో తల్లిదండ్రుల గొప్ప ప్రమేయం ఉంది. మహాప్రవక్త (సఅసం) ప్రవచనంలో ఇలా ఉంది.

ప్రతి శిశువు నైతికంగా జన్మిస్తాడు. వాడి తల్లిదండ్రులు అతణ్ణి యూదుడిగా, లేదా క్రైస్తవునిగా, లేదా, జొరాష్ట్రియునిగా తయారు చేస్తారు. సంతానానికి కావలసిన మంచి శిక్షణ ఇవ్వాలి. సలక్షణమైన మార్గంలో శిక్షణ ఇవ్వనిచో సంతానం ప్రాపంచిక జీవితంలో కూడ సమస్యలను తెచ్చిపెట్టు తుంది, పరలోకంలో మనిషి ఆలాంటి నిర్లక్ష్యానికి ప్రశ్నించబడుతాడు. సంతానం సుశిక్షణ పొందితే అది ప్రాపంచిక విజయానికి దోహదపడుతుంది,

పరలోకంలో కూడ గడ్డు సమయంలో ప్రయోజనపడుతుందని విశ్వసించవచ్చు

సంతానానికి సుశిక్షణ అంటే ఏమిటి?

సంతానానికి సుశిక్షణ ఏదో తాత్కాలికంగా లేదా వెంటనే ఇవ్వగలిగే వస్తువుకాదు. ట్రైనింగు అనేది నీటిలో కరిగించి తాపించే పానకమూ కాదు. శిక్షణ అనేది నిరంతర ప్రక్రియ, సుదీర్ఘకాలిక కృషి, వివాహం కాకముందు మొదలైన సంతాన శిక్షణ, వివాహ సమయంలో వధూవరుల ఎంపికకు ప్రేరణ కలిగిస్తుంది.

వివాహానికి ముందు అలుమగలు ఎంపిక గురించి వివరాలు మహా ప్రవక్త (సఅసం) ప్రవచనాలలో ఉన్నాయి. వాటి ప్రస్తావనకు ఇక్కడ అవకాశం లేదు. కేవలం రెండు ప్రవచనాలను ఉల్లేఖిస్తున్నాం. ఒకటి వరుని ఎంపిక విషయానికి సంబంధించింది. మరొకటి వధువు ఎంపికకు సంబంధించింది.

వధూవరుల ఎంపిక విషయంలో ఇస్లాం ధార్మికతకు దైవభయానికి ప్రాముఖ్యత ఇచ్చింది. ధార్మికతను గాలికి వదిలేసి మరో విషయానికి ప్రాముఖ్యత ఇవ్వనే లేదు, పైగా అటువంటి వాటన్నిటిని నిరసించింది. ఒక హదీసు వరుని గురించి ఉంది, చదవండి. *(తిర్మిజి)* మీ వద్దకు ధార్మికత, మంచి నైతిక ప్రవర్తన కలవారి సంబంధం వచ్చినట్లయితే వారితో వివాహం నిశ్చయించి చేయండి. ఇలా చెయ్యకపోతే భువిలో సంక్షోభం, ఘర్షణలు వ్యాపిస్తాయి.

వధువు విషయంలో అందరికి తెలిసిన ఒక హదీసు ఇలా ఉంది.

ఒక మహిళతో వివాహం నాలుగు కారణాలవల్ల చేయబడుతూంది. సిరిసంపదల కారణం వల్ల, వంశ కారుణం వల్ల, సౌందర్య కారణం వల్ల నైతికత, ధార్మికత కారణం వల్ల మీరు ధార్మికత కలవారితో వివాహ మాడండి, మీ చేతులు తడిగా ఉంటాయి. (వివాద రహితంగా ఉంటాయి)

పై రెండు ప్రవచనాలలో వివాహ ఎంపిక ధార్మికత ఆధారంగ ఉండా లని చెప్పబడింది. అలా ఉండక పోయినట్లయితే మొదటి హదీసు ప్రకారం ప్రపంచంలో అలజడి, అల్లకల్లోలం వ్యాపిస్తుందని చెప్పబడింది.

దంపతుల ఎన్నిక తరువాత వారి వైవాహిక జీవితం ప్రారంభ మౌతుంది. ఈ వైవాహిక జీవితం వల్ల సంతానం కలుగడం జరుగుతుంది. ఈ విషయంలో కూడ ఒక నియమావళి, ఒక విధానం ఉంది, దానిని పాటిం చాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు కలయిక సందర్భంలో ప్రార్థన చేయడం, కలుగబోయే సంతానం షైతాను దౌష్టికత నుండి రక్షింపబడాలనికోరడం ఉంది.

ఒక ప్రార్థన ఇలా ఉంది.

ప్రభూ! మా కలయిక వల్ల కలిగే సంతానాన్ని షైతాను దౌష్ట్యం నుండి కాపాడు.

తల్లి గర్భవతిగా ఉన్న సమయంలో ఆమె దైవాన్ని స్మరిస్తూ ప్రార్థన చేస్తూ ఉండాలి. కలగబోయే శిశువు శ్రేయాన్ని అభిలషించాలి. సంతానం కలిగితే తల్లిదండ్రులు దైవానికి కృతజ్ఞత తెలుపుకోవాలి. దివ్యగ్రంథం ఖుర్‌ఆన్‌లో ఇలాంటి కృతజ్ఞతను వివరించడం జరిగింది. "సత్ప్రవర్తన కల సంతానం కలగడం కూడ దైవానుగ్రహమే. దానిపై దైవానికి కృతజ్ఞత తెలుపు కోవడం అవసరం".

శివువు జన్మించినప్పుడు, ఏ శిశువు కలిగినా దాన్ని దైవానుగ్రహంగా తలచి స్వీకరించాలి. తనయుడు కల్గినంతమాత్రాన ఆనందపరవశులై మనోతృప్తికై విస్తృతంగ ఖర్చు చేయడం, పుత్రిక కల్గినట్లయితే ముఖానిపై నలుపు ఛాయలు అలుముకొనేట్లు దుఃఖాన్ని ప్రకటించడం చేయరాని పని, తమకోసం పుత్రుడు శ్రేయాన్నిస్తాడో పుత్రిక ఇస్తుందో ఏ మనిషి చెప్పలేడు. పుత్రుడు కలిగినా, పుత్రిక జన్మించినా అందులో శ్రేయనిర్ణయం ఉందని దైవం తెలిపాడు. మహాప్రవక్త(సఅసం) ప్రవచనాలలో పుత్రిక వల్ల శ్రేయం సమృద్ధి కలుగుతుందని, పుత్రుడు హృదయపు ఫలమని తెలుపబడింది. అందుచేత

కలిగిన సంతానం పట్ల దైవానికి కృతజ్ఞత తెలుపుకోవాలి. ఇస్లామి దృష్ట్యా పాటించాల్సిన కార్యక్రమాలను తప్పక నెరవేర్చాలి. ఆ కార్యక్రమ నిర్వహణకు మొదటి నుంచి సిద్ధంగా ఉండాలి.

శిశువు జన్మించిన పిమ్మట చేయవలసిన కార్యక్రమంలో మొదట శిశువును శుభ్రంచేసి అజాన్, ఇఖామత్ వినిపించడం, శిశువు జన్మించిన ఏడవ దినం అఖీఖా చేయడం, శిశువుకు మంచి పేరు పెట్టడం, తలవెంట్రుకలు గొరిగించడం ఈ మూడు విషయాల ఆదేశాలు మహాప్రవక్త ప్రబోధనలలో ఉన్నాయి. నామకరణం చేయడంలో పేరులోని తప్పులను సరిదిద్ది మంచి పేర్లను పెట్టిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

శిశువు కోసం అఖీఖా చేయడం ఒక ముఖ్య సున్నత్. దైవప్రవక్త (సఅసం) అఖీఖా చేయాలని ఆదేశం ఇచ్చారు. దాని వల్ల కలిగే దైవకృపాదరణలను ఆయన(సఅసం) తెలిపారు కూడ, అఖీఖా చేసే విధానం కూడ ఆయనే (సఅసం) విశదంగా తెలిపారు. శిశువు జన్మించిన ఏడవదినం అఖీఖా చేయాలని ప్రవక్త(సఅం) ప్రబోధించారు. ఏడవదినం అఖీఖా చేయనట్లైతే ఆ తరువాత చేసేది అఖీఖా అనబడదు. కొంతమంది ఒక సంవత్సరం తరు వాత ఇంకా కొంతమంది చాల కాలం గడిచిన పిమ్మట అఖీఖా చేస్తారు. ఇది ధర్మసమ్మతంకాదు. అఖీఖా ఏడవదినం చేయడమే ధార్మికంగ రుజువైంది. హదీసులో ప్రస్ఫుటంగ ఇలా చెప్పబడింది ప్రతి శిశువుకు అఖీఖా చేయడం అవసరం. పుట్టిన ఏడవదినం ఆ శిశువు తరపున జంతువుని జుబా చేయాలి. శిశువుకు పేరు పెట్టాలి, శిశువు శిరోముండనం చేయాలి.

ఈ పనుల తరువాత 'ఖత్నా' పని ఉంటుంది. ఈ విషయంలో కాల పరిమితిలేదు. 'ఖతనా' కూడ తొందరగా చేయడం ఉచితమనే తలంచబడింది.

శిశువుకు తల్లి పాలిచ్చే సమయం రెండేళ్ళు లేదా రెండున్నర సంవత్సరాలు. ఈ సమయంలో తల్లి ఒడిలో ఉంటాడు శిశువు. తల్లి శిశువుకు ప్రథమ గురువు. ఆమె శిశువుకు ఎన్నో విషయాలను నేర్పుతుంది తల్లి ఒడి శిశువుకు తొలి బడి. ఎన్నో పదాలు అక్కడే నేర్చుకుంటాడు. శిశువు పలికే తొలిపలుకులు

మంచి పదాలు ఉండాలని తల్లి ప్రయత్నించి నేర్పాలి. శిశువు ఆరోగ్యం మంచిగా ఉండేట్లు తల్లి చూచుకోవాలి. శిశువు జీవితం తొలిమెట్టు తల్లిఒడి. ఆ తరువాతి మెట్టు ఈ తొలి మెట్టుపై ఆధారపడింది అందుచేత మాతృమూర్తి ఈ దశలోనే పసికందుకు మంచి మాటలు నేర్పించాలి. మర్యాదకరమైన నియమావళితోబాటు సంస్కృతి నేర్పించాలి. సంభాషణ శైలి నేర్పాలి. కొద్దిమంది తల్లులు తమ సంతానం అసభ్యకరంగ మాట్లాడినా చూస్తుంటారు సంతానాన్ని సంస్కరించి మంచి పదాలు వాడడం నేర్పించేందుకు బదులు. ఆ అసభ్యత పట్ల సంతోషాన్ని వ్యక్తపరుస్తుంటారు. దాని వల్ల దుష్ప్రభావం రెండు విధాలుగ సంతానం మీద పడుతుంది మొదట అసభ్యపదజాలం నిరంతరం వాడి దానికి అలవాటు కావడం, అలవాటు మారక తన వ్యక్తిత్వాని కోల్పోవడం జరుగుతుంది.

"మీకు సిరిసంపదలను, సంతానాన్ని ప్రసాదిస్తాడు" (నూహ్ : 12)

తల్లిదండ్రుల ప్రథమ కర్తవ్యం, వారిసంతానాన్ని ఎలా చూడదలచారో దాని పట్ల శ్రద్ధచూపించడం. వారి హక్కులో ఏది ఇవ్వదలచారో దాని కోసం కృషి చేయడం. తల్లిదండ్రుల ఆశయం సంతానం పెరిగి పెద్ద వారైమంచి మనుషులుగ సమాజంలో రాణించాలని, దేశానికి కుటుంబా నికి కీర్తి తేచ్చే వ్యక్తిగ తయారు చేయాలని ఉందా? ఆలోచించండి. ఈ విషయం నిరంతరం వారి ఎదుట ఉన్నట్టేతే సంతానాన్ని మంచి వరుసలో ట్రయినింగ్ ఇవ్వడం, శిక్షణకు కావలసిన విధానాన్ని అన్వేషించడం దృష్టిలో ఉంటుంది. ఈ లక్ష్యం తల్లిదండ్రుల ఎదుట లేకుంటే అన్ని వైజ్ఞానిక విధా నాలు అవసరాలు అటకెక్కుతాయి. సంతానం విషమొక్కల్లా పెరిగి, బండ క్రింద మొలిచే గడ్డి పూసల్లా నిరర్థక జీవులవుతారు.

మనం సంతానవాస్తవాన్ని గుర్తించాలి. ప్రపంచంలో విజయం సాధించిన ప్రతి వ్యక్తి నైతిక విధానానికి కట్టుబడి తల్లి గర్భం నుండి ప్రపంచంలో జన్మిస్తాడు. సర్వావయాలతో సౌష్టవంగ ప్రసవించబడుతాడు. ఏ వ్యక్తి జీవితంలో పరాజయితుడౌతాడో లేదా అపరిపక్వజీవితం గడుపుతాడో అతని మార్గంలో పెద్ద అవరోధమేమీ లేదు. అందరు మంచివారిగా వర్ధిల్లుతూ

మంచి తల్లిదండ్రులుగా మారాలి. ప్రేమాదరణకల సోదరులుగా, ఇరుగు పొరుగు వారికి మంచి స్నేహితులుగా ఉండాలి. ప్రపం చంలో సంతానం తల్లి దండ్రులకు కన్నుల పండువుగ ఉండాలి. తల్లిదండ్రుల మరణానంతరం సంతానం వారికి నిత్యపుణ్య ప్రసాదితులు కావాలి. సంతానం పరలోకంలో వారి తల్లిదండ్రులకు అవమానం కలిగేలా ప్రపంచంలో జీవించరాదు.

మనం తరచు సమాజంలో ఒక విషయం చూస్తుంటాం. ప్రజలు ఇతరుల సంతానాన్ని చూస్తు అటు ఇటు ఆలోచించ కుండ విమర్శనాస్త్రాలు సంధిస్తుంటారు.

తమ సంతానంలో కూడ ఇతరులలో తమకు కనబడుతున్న తప్పులున్నాయని ఆలోచించరు. అందుచేత తల్లిదండ్రులు నిరంతరం తమ సంతానాన్ని సుశిక్షితులుగ చేసే ఆలోచనాపరులై ఉండాలి. సంతానం గురించి అప్పుడప్పుడు విమర్శనా సమీక్ష చేస్తుండాలి. వారిలో ఉన్న చెడులను, లోపాలను మంచి ప్రజ్ఞాపాటవంతో దూరం చేయడానికి కృషి చేయాలి వారిలో ఉన్నమంచి మరింత పెంచడానికి ప్రయత్నంచాలి. మరోక మరువరాని అంశం ఉంది. ప్రజలు తమ సంతానం పట్ల అంతా సవ్యంగ ఉంద్న భావన కలిగి ఉంటారు. వారు తమ సంతానం పెరిగి పెద్దవారై అనన్యసామాన్యలౌతారని పొగడ్తుంటారు. అన్నిరంగాలలో, అన్ని విద్యలలో సవ్యసాచులుగ ఉంటారని తలుస్తారు. ప్రతి విషయంలో ప్రవీణత ప్రదర్శి స్తారని తలుస్తారు. సమకాలీన విద్యలన్నిటిని అభ్యసిస్తారని ఊహిస్తారు.. ఇలాంటి భావనలు వాస్తవంగా నిజమైతే మంచిదే. కాని ఇలాంటి గుణ గణాలు కేవలం ఆలోచనలో ఉండి, ప్రయోగాత్మకంగా అన్ని శూన్యమైతే సాధించేదేదీ ఉండదు. కేవలం ఆలోచనలకే పరిమిత మౌతుంది వారి జీవితం, సంతానం విజ్ఞానాన్ని పొందుతున్న సమయంలో తన కంటు ఒక ప్రత్యేక మూర్తిత్వం ఉండాలని తలుస్తున్న సమయం ఒక అద్భుత ప్రాయంలో గడుస్తుంది అలాంటి ప్రాయంలో తల్లిదండ్రులు సంతానం పట్ల

ప్రత్యేక శ్రద్ధ తీసికోవాల్సి ఉంటుంది. ఈ ప్రాయం సంతానపు 14 ఏండ్ల వయస్సు లో గడుస్తుంది ఈ వయస్సులో సంతానపు ధృక్పధం మరియు మేధా సంపత్తి ఒక ప్రత్యేక పంథా ననుసరిస్తుంది. దీని అర్ధం ఆ వయస్సు దాటిన తరువాత తల్లి దండ్రులు సంతాన విషయంలో శ్రద్ధతీసుకోనవవసరం లేదని కాదు శిక్షణ ప్రతి వయస్సులోనూ సాధ్యమే. ఆ వయస్సు దాటిన తరువాత కేవలం మార్గదర్శకం ఉంటే చాలు. సాధారణంగ మనకగుపడే విషయం సంతానం 14 సంత్సరాల ప్రాయానికొచ్చి ఏదో ఒక మనస్తత్వం కలిగి ఒక మార్గం అనుసరిస్తారు. అందుచేత ఆవయస్సు వచ్చేంతవరకు తల్లి దండ్రులు పిల్లల పట్ల అమిత శ్రద్దాశక్తులు చూపి వారికి శిక్షణ ఇవ్వలి.

కొన్ని జాగ్రత్తలు

పిల్లల సుశిక్షణలో కొన్ని జాగ్రత్తలు తప్పకతీసుకోవాలి. పిల్లల్ని చీటికి మాటికి చీవాట్లు పెట్టకూడదనేది అందులో ఒకటి వారు చేసే పనులలో కారణమున్న లేకున్న లోపాన్వేషణ చెయ్యడం, వారి అనర్హతలను సూచిస్తూ సంతాపం ప్రకటించడం ఏ మాత్రం తగదు. పిల్లల గురించి కోపావేశాలతో నిందించడం, వారిని నిత్యం మందలించడం విద్యాబుద్ధులు నేర్పించే మార్గంలో ఘాతకం అవుతుంది. సంతానం జ్ఞానదశలో వచ్చిన తరువాత తల్లిదండ్రుల చీవాట్లకు అలవాటౌతారు. అబ్బాయి నీకు అసలు బుద్ధంటూ లేదురా, బుద్ధి ఉంటే ఎందుకు ఆలోచించి చూడవు మెదడుకాదు బుర్రలో మన్నుఉందని చీవాట్లు పెడుతుంటాం. ఇలాంటి విమర్శలు, బలహీనతల మాటలు విని పిల్లలు పెద్దవారయ్యాక వాటినే జ్ఞపిక్తి తెచ్చుకొంటుంటారు. దాని ప్రభావం ఏమౌతుందో తెలుసా? పిల్లలు తల్లిదండ్రుల పట్ల మరియు విద్య శిక్షణ పట్ల విద్రోహ వైఖరి అవలంబిస్తారు వారి జ్ఞానం అధోగతి పాలౌతుంది. పర్యవసానంగా పిల్లలు దారితప్పి చెడు అలవాట్లకు గురౌతారు. లేద ఏమి చేయలేని దద్దమ్మలుగ తయారౌతారు. అంటే బాల్యదశలో పిల్లలకు పెట్టే చీవాట్లు విమర్శలు వారి మనస్తత్వంపై మంచి ప్రభావం

చూపక జీవితమైదానంలో వారు విజయం పొందలేక అస్తవ్యస్త మైన ఆలోచనలలో పడిపోతారు.

రెండవ విషయం ప్రతి పిల్లవానికి సృజనాత్మక శక్తి ఉంటుంది. అది పెద్దల అశ్రద్ధవలన తీసుకోవలసిన జాగ్రత్తలు పాటించనందువలన, దెబ్బ తింటుంది. పెద్దలు పిల్లలందు అగుపడే సృజనా శక్తులను పొగిడి, వారి వీపులు తట్టి మన స్థయిర్యాన్ని పెంచాలి. పిల్లవాండ్ల శక్తి సామర్థ్యాలు పెడమార్గం పట్టినట్లతే మంచి ఉపాయంతో వారిని మంచి పనులవైపు మళ్ళించి పిల్లల పురోభివృద్ధి ఆకాంక్షించాలి.

మూడవ విషయం పిల్లలందు మనో బలాన్ని పెంచాలి, పిల్లలు ఆత్మ విశ్వాసం పోగొట్టుకుంటే అది వారి జీవితంలో ఒక పెద్ద ప్రమాదంగ పరిగణించబడుతుంది. తెలిసి తెలియని ఆవయస్సులో పిల్లలు ఆత్మవిశ్వాసం కలిగి ఉంటే అదోక ఆయుధంగా, లక్ష్యసాధనకు ఒక శ్రేయస్కర మార్గంగా ఉపయోగపడుతుంది. మనోధైర్యం, నమ్మకం కల వ్యక్తి జీవితంలో అన్ని రంగాలలో కృతకృత్యుడౌతాడు. ఎదురయ్యే అనేక సమస్యల్ని కేవలం ఆత్మవిశ్వాసంతో సవ్యంగ పరిష్కరించుకోంటాడు, తన పైనమ్మకం లేకపోతే పరాజయం పాలుకావడమే కాకుండ జీవితమే నిరర్థకం చేసుకొంటాడు. నాలుగవ విషయం సంతానానికి నాయకత్వం వహించే గుణగణాలతో తీర్చిదిద్దాలి. సంతానం తనకు ఎదురౌతున్న సమస్యలలో నిర్ణయాధికారం పొందాలి, మంచి ఫలితాలు సాధించే విధానాలు పాటించాలి విద్యాబుద్ధులతో లభ్యమైన శక్తుల్ని సంపూర్ణంగ ఉపయోగించుకొనే అలవాటు చేసుకోవాలి, హజ్రత్ ఇబ్రాహీం (అలై) దైవాన్ని ఇలా ప్రార్థించారు.

> **"మా ప్రభూ! మాకు మా భార్యల ద్వారానూ మా సంతానం ద్వారానూ కన్నుల చల్లదనాన్ని ప్రసాదించు, మమ్మల్ని భయభక్తులు కలవారికి ఇమాములుగా చేయి." (అల్ ఫుర్ఖాన్ - 54)**

ఇదే భావాన్ని తెలియపరుస్తూ మరో ప్రార్థనలో తన సంతానానికి నాయకత్వ గుణగణాలు కల్గించమని ప్రార్థించడమయింది.

ధర్మసమ్మతమైన జీవనోపాధి

సంతానపు శిక్షణలో ధర్మసమ్మతమైన (హలాల్) ఉపాధితో శిక్షణ ఇవ్వడం ప్రాముఖ్యత సంతరించుకోంటుంది. పిల్లల ప్రగతి కోసం, వారి అభివృది కోసం తల్లిదండ్రులు ధర్మసంపాదన నుండే వ్యయం చేయాలి అధర్మంగా, హరాం మార్గంలో తల్లిదండ్రుల సంపాదన ఉండరాదు. అటు వంటి సంపాదన సంతానం పై ఖర్చు చేయరాదు, అది నిషేధించబడింది. నిషధ్ధ సంపాదనతో పోషింపబడేవారి జీవితం సద్గుణ సంపన్నం కాజాలదు. వారి శరీరాలు సత్కార్యాలు చేయలేవు. హరామ్ వస్తువులతో పోషించబడే సంతానంలో హలాల్ వస్తువులతో పోషించబడే సంతానంలో చాలా వ్యత్యాపం ఉంటుంది. ప్రవక్త ప్రవచనాలలో (హరామ్) నిషిధ్ధ సంపాదనతో పెంచబడే శరీరాలు విమర్శించబడ్డాయి. తర్భీదు(శిక్షణ) పరిధి విశాలమైంది. కేవలం విద్యాపరంగా, నైతిక పరంగా శిక్షణ ఇవ్వడమే కాదు, సాంకేతిక పరంగా, ఆధునిక వైజ్ఞానిక పరంగా, మతపరంగా, రాజకీయపరంగా, వ్యక్తి నుండి సమాజం వరకు శిక్షణ ఇవ్వవలసి ఉంది. ఈ శిక్షణ జీవితరంగాలన్నిటీని పర్యవేక్షించి ఉంది. అన్ని రంగాలలో శిక్షణ గురించి చర్చించేదుకు అవకాశంలేదు. అంచేత ధార్మిక మతపరమైన శిక్షణ విషయాన్నే చర్చిద్దాం.

జీవిత ఇతర రంగాలలో శిక్షణ గురించి ఆలోచించినట్లయితే మనిషి స్వతహాగా నిరంతర ధ్యానంతో, సంక్షేమాన్ని పురస్కరించుకొని తగిన పద్ధ తుల్ని ఏర్పరచుకొన్నాడు. తల్లి దండ్రులు కూడ ఆయా రంగాలలో శిక్షణ కోసం ప్రత్యేక వసతులు ఏర్పరచుకొన్నారు. విద్యారంగంలో నేడు శిక్షణకు ప్రాముఖ్యత ఇవ్వబడుతుంది. సంతానానికిచ్చే విద్యా శిక్షణలలో తల్లి దండ్రుల రాబడిలో ఒక లెక్కింపదగిన భాగం వ్యయం చేయడం జరుగు తుంది. సాంకేతిక, మరియు వ్యక్తిగత ట్రయినింగ్ కూడ ఇదే వరుసలో వస్తూంది. కాని ఆ విషయాన్ని ప్రస్తావించక కేవలం ధార్మిక శిక్షణ గురించి ఆలోచిద్దాం.

సంతానపు మానసిక శిక్షణకు ఇస్లాం అత్యంత ప్రాముఖ్యతనిచ్చింది. ఈ శిక్షణ తల్లిదండ్రులు సంతానానికిచ్చే మంచి బహుమానం. తల్లి దండ్రులు సంతానాని కోసం ఎంత శ్రేయోజనక పని చేస్తున్నా అందులో ఎదో ఒక లోపం, అనర్థం ఉంటుంది. కాని సంతానానికిచ్చే ధార్మిక శిక్షణలో ఏ లోపం ఏ నష్టం చేకూరే అవకాశం ఉండదు,

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారు.

(మిష్కాత్ కితాబుల్ అదబ్)

తండ్రితన సంతానానికిచ్చే వాటన్నిటిలో అత్యుత్తమమైనది పిల్లలకిచ్చే విద్యాబుద్ధులు, శిక్షణ.

విశ్వాసులారా మీరు మిమ్మల్ని, మీ కుటుంబ సభ్యులనూ మానవులు, రాళ్ళ ఇంధనం కాబోయే అగ్ని నుండి కాపాడుకోండి.
(అత్ తహ్రీమ్-6)

ఓ విశ్వాసవంతులార! మిమ్మల్ని, మీ కుటుంబీకులను నరకాగ్ని నుండి రక్షించుకోండి",

ఈ వాక్యం నుండి ధార్మికత అంటే ఏమిటో అర్థమౌతుంది. శిక్షణ అంటే ఏమిటో తెలుస్తుంది. వేరోక మహాప్రవక్త(సఅసం) ఆదేశం ఉంది. సంతానాన్ని గురించి తల్లిదండ్రులు తీర్పు దినాన్న ప్రశ్నించబడుతారు.

బుఖారి, ముస్లిం హదీసులో ఇలా ఉందని ముందే ప్రస్తావించాం.

మీరందరు బాధ్యత కలవారు. మీ అధీనంలో ఉన్నవారందరి విషయంలో ప్రశ్నించబడుతారు మనిషి తన కుటుంబంవారి పట్ల బాధ్యత కలవాడు. వారి విషయలలో మీరడుగబడుతారు.

సంతానానికి సుశిక్షణ ఇవ్వడం తల్లి దండ్రుల బాధ్యత. వారు నరకాగ్ని నుండి రక్షింపబడేందుకు సకల ప్రయత్నాలు చేయాలి. వారి జీవితాలు దైవభయంతో గడిపేట్లు ఉండాలి. వారి ఆత్మల అంతః ప్రక్షాళన జరుగాలి. వారిలో మంచి గుణగణాలు సమృద్ధినొందాలి, చెడు నుండి వారు దూరంగ ఉండాలి. సంతానానికి ట్రయినింగ్ ఇవ్వడంపట్ల మహాప్రవక్త (సఅసం)

ఆదేశం స్పష్టంగా ఉంది. పిల్లవాండ్ల శిక్షణ మొదట కలిమ-యె-తయ్యబ (విశ్వాసవచనం) తో ప్రారంభంకావాలి. అన్నిటికంటె ముందు విశ్వాసవచనాల పట్ల పిలుపు ఇవ్వడమయింది. దైవఏకత్వం, దైవ సందేశ ప్రవక్త పట్ల విశ్వాసం, దివ్యఖుర్ ఆన్, ఇతర దైవవాణి గ్రంథాలు,స్వర్గనరకాలు, మరణానంతరం పరిష్కారదినం అక్కడ జరిగే విచారణ మొదలగు విషయాల గురించి సంతానానికి తెలియ జేయాలి. పిల్లలు ఈ విషయాలతో వాస్తవ దృక్పథం కలిగి ఉండాలి. అలాంటప్పుడు సంతానం జీవితకాలంలో ప్రగతి సాధిస్తూ ఒక నిర్ణీత మార్గం పై నడుచుకుంటుంది. వారి ఆలోచనా శక్తులు పరిపక్వం కావడానికి మార్గం సుగమ మవుతుంది.

ఒక మాట గుర్తుంచుకొండి . ఈనాటి కాలంలో పిల్లల మానసిక సామర్థ్యాన్ని పెంచడానాకి ఎక్కువ ప్రయత్నం చేయబడుతోంది. మన విధ్యావిధానం కూడా అదే దిశలో తయారు చేయబడింది. పిల్లల మానసిక శక్తి పెరగాలని విద్యా వ్యవస్థ కోరుతోంది. ప్రతి విషయాన్ని విద్యార్థి స్వంత ప్రయత్నంతో తెలుసుకోవాలంటుంది. ఇలాంటి వ్యవస్థలో ధార్మిక విశ్వాసాలను కూడ పిల్లల తమ శక్తి సామర్థ్యాలను వినియోగించి, పరిశీలన చేసుకోవాలి. ఆ పిమ్మట వాటిని విశ్వసించాలి అని చెప్పడం సమంజసం కాదు. మానసిక శక్తి సామర్థ్యాలను స్వంత కృషివల్ల విద్యాభివృద్ధి చేసుకోవచ్చు కాని విశ్వాసాలు స్వంతంగా సంపాదించు కొనేవి కావు. అవి ప్రవక్తల ద్వారా మనకు సమకూరేవి. ప్రవక్తలు కూడ ఆ విషయాలను స్వయంగా సమకూర్చి స్వంత ఆలోచనతో కృషితో మనకు అందించినవి కావు. దైవం దివ్యవాణి ద్వారా ప్రవక్తలకు వాటి విషయాలు తెలిపాడు. ఇక విశ్వాసాల విషయంలో ఎవరి ప్రయత్నం కృషి ఉండదు. దైవసంకల్పం ఆధారభూతమైనవి. అందుచేత విశ్వాస విషయాలన్నీ ఏ విధంగా ప్రవక్తల ద్వారా అందయో అదే రూపంలో వాటిని స్వీకరించాలి.

రెండవ విషయమేమంటే, ఈనాటి సమస్యలకు కేవలం బుద్ధి ఉంటే చాలదు. విజ్ఞత మార్గదర్శకం అవసరం. దీన్ని ఆంగ్లంలో గైడెడ్ విజన్ అంటారు. పిల్లలకు మార్గదర్శకం లేనట్లయితే వారు దారి తప్పుతారు. ఏదీ

సాధించలేరు. నేడు విద్యా విధానంలో గ్రెడెడ్ రీజనింగ్ ఎంతోఅవసరం. దాని ఆధారంగానే విద్యావిధానం అమలులో వచ్చింది. పిల్లలు తమ బుద్ధి బలాన్నీ స్వేచ్ఛగా ఉపయోగించగలరు. కాని, అధ్యాపకులు చుట్టూ ఉన్న వాతావరణాన్ని, పుస్తక విషయాలను ముందుంచికొని మార్గదర్శకం చేస్తారు. అందువల్ల విశ్వాస విషయాల్లో కూడా బుద్ధిని ఉపయోగించాలి. మార్గదర్శకత్వం నుంచి జ్ఞానోపదేశం పొందాలి.

విశ్వాసాలు విద్యాబుద్ధులకు వ్యతిరేకంగా లేవు. అవి బుద్ధి నైతికతలకు సవ్యంగా ఉన్నాయి. ఈనాటి, పరిశోధనలు ఈ వాస్తవాన్ని ధృవీకరిస్తున్నాయి. అదేమంటే, విశ్వాసం, మత భావం మానవునిలో స్వాభావికంగా ఉన్నాయి. అయినప్పటికి మనిషి కేవలం తన ప్రయత్నం ద్వారా విశ్వాసాల వాస్తవికతను పొందలేడు. కాని వాస్తవికతలతో పరిచయం అయ్యాక వాటి సత్యాన్ని గురించి వివరణ కూడా ఇచ్చాక పిల్లలు మన స్ఫూర్తిగా విశ్వాసాల సత్యాలను వాటి వాస్తవికతలను అంగీకరిస్తారు ఆ పిమ్మట అతడి మనస్తత్వం విశ్వాసాలతో ప్రకాశిస్తుంది. అప్పుడు ఆ పిల్లలు విశ్వాసాలు అంటే ఒక సంప్రదాయం కాదు,అవి నిత్యసత్యం అని మనసారా అంగీకరిస్తారు. అది నైతికమని గుర్తిస్తారు. కేవలం విశ్వాసాల అమృతం గ్రోలడమే కాక వాటిని చూడగలరు వాటిలో నిరంతరం ఉండే జీవశక్తిని కూడా చూడగలరు.

విశ్వాసం తర్వాత ముఖ్యవిషయం నమాజ్. దైవం ఈ విషయంలో ఇలా అన్నాడు;

సంతానాన్ని నమాజుకు ఆజ్ఞాపించండి. అందుకు గాను ఒత్తిడి తీసుకురండి. సంతానానికి నమాజు చేయమని ఆజ్ఞ ఇవ్వాలి. హదీసులో ఈ విషయం ఇంకా విశదంగా తెలుపబడింది. పిల్లలకు ఏ సమయంలో ఏ విధంగా నమాజు అలవాటు చేయలో చెప్పబడింది. మరో ప్రవచనంలో ఇలా చెప్పబడింది. ఏడేళ్ళ ప్రాయానికి రాగానే వారికి నమాజు చేయమని ప్రోత్సహించాలి. పదేళ్ల ప్రాయనికి వచ్చేసరికి వారు నమాజు వదిలితే దండించాలని చెప్పబడింది. *(అబు దావూద్; 495)*

ఈ హదీసు అబూ దావూద్ మరియు తిర్మజిలో కొద్ది పాటి వ్యత్యాసంతో చెప్పబడింది. ఇమామ్ తీర్మిజి దీన్ని వేరుగా వర్ణించారు. దీనితో మనకు తెలిసేదేమంటే పిల్లలకు ధార్మిక శిక్షణ ఇవ్వడం మన విధి. నమాజు అన్ని విధులలో ప్రముఖమైనది, ప్రతిరోజుతప్పని సరిగా చేసేది. అందుచేత నమాజు విషయం ప్రత్యేకంగా ఉల్లేఖించడం జరిగింది. కాకపోతే అన్ని ధార్మిక విధులు మరియు ధార్మిక పనుల విషయం శిక్షణ రూపంలో ఇవ్వాలని కోరబడింది. దివ్యఖుర్ఆన్ లో విపులంగా చెప్పబడింది. "ఓ విశ్వాసులారా! మిమ్మల్ని మరియు మీ కుటుంబీకులను నరకాగ్ని నంచి రక్షించుకోండి. నరకాగ్ని నుంచి రక్షించుకోవడం ధార్మికంగా సాధ్యపడుతుంది. అందుచేత ధార్మిక విద్య కుటుంబీకులకు నేర్పడం తప్పనిసరి. మహాప్రవక్త (స) తెలిపిన కొన్ని సన్నివేశాలలో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాలని నొక్కిచెప్పారు. ఉదాహరణకు ఒక హదీసులో దానం కోసం వచ్చిన ఖర్జూరాలలో హజ్రత్ హసన్(రజి) ఒక పండు తీసుకొన్నారు, నోటిలో పెట్టుకొన్నారు. వెంటనే ప్రవక్త(స) స్పందిస్తూ పండును నోటి నుంచి పారేయమని అన్నారు. నీకు తెలియదా మేము దాన ధర్మల వస్తువుల్ని తినం అన్నారు.

(ముత్తఫికున్ అలె, బుఖారి 1069/280। 3)

పై ఉదాహరణ ద్వారా మనకు తెలిసిందేమంటే సంతానానికి నిషేధించిన వస్తువులు, స్వీకరించ వలసిన వస్తువుల (హరాం/ హలాల్) విద్యనేర్పడం తల్లి దండ్రుల బాధ్యత. తల్లిదండ్రులు, పిల్లలకు హరాం/హలాల్ విషయాలు తెలుపకపోతే సంతానం ఆ విషయం గ్రహించలేదు. రెండవది ఆ విషయ ప్రాముఖ్యం కూడ వారి మనస్తత్వంలో ఉండదు. వారు వాటి పట్ల శ్రద్ధ కూడా చూపరు. పైన తెలుపబడిన ప్రవక్త(స) ఉదాహరణలో పిల్లలకు హరాం/ హలాల్ విషయాలు తెలియజేసే అవసరం ఉందని వారిని సరియైన మార్గంలో విద్యాబుద్ధులు నేర్పాలని, సుగుణ సంపదతో వారిని తీర్చిదిద్దాలని, ఆ శిక్షణ కూడా మంచి దృక్పథంలో ఉండాలని తెలుస్తోంది. మరో హదీసులో ఈ విషయం ప్రాధాన్యతను ఈ విధంగా తెలిపారు. సంతానం వయసు పదేళ్ళయితే వారి పడక వేరుచేయాలని చెప్పారు *(అబుదావూద్495)*

ఈ విషయంలో కూడా అసలు శిక్షణ ఏమంటే పిల్లల నైతిక శిక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవల్సి ఉంది. నైతిక ప్రవర్తన ఉన్నతంగా ఉండాలని కోరడమైంది. పిల్లలకు కుటుంబీకులకు శ్రేయాన్ని ఇచ్చే విద్య నేర్పి వారికి కావలసిన శిక్షణ ఇవ్వాలి. సంతానానికి శిక్షణ ఇవ్వడమనేది తల్లిదండ్రుల ప్రముఖబాధ్యత. దాని పట్ల నిర్లక్ష్యం ఒక గొప్ప పూడ్చలేని నష్టాన్ని కలిగిస్తుంది. సంతనానికి శిక్షణ పట్ల అశ్రద్ధ వహించడం వల్ల పరలోకంలో ప్రపంచంలో గొప్ప ప్రయోజనలను కోల్పోతాము. సంతానం ప్రపంచంలో నిరంతరం కొనసాగే పుణ్యకార్యం అవుతుంది. పరలోకంలో ఒక అమూల్య నిధి. అందుచేత తల్లి దండ్రులు సంతానం పట్ల శ్రద్ధాసక్తులతో శిక్షణ ఇస్తే అది వారికి ఇహపరాలలో విజయం లభించేలా చేస్తుంది.

సంతానానికి శిక్షణ క్రమక్రమంగా ఇస్తూ అదిమన జీవిత కాలంలోనే ఉపయోగపడేటట్లు ప్రయత్నం చేయాలి. సంతానం ఆరోగ్యంగా ఉండేలా చూడాలి, సమాజంలో వారికి సభ్యత, ఉన్నత విద్య, మంచి సాంకేతిక శిక్షణ విశాల దృక్పథం గల గొప్ప వ్యక్తిత్వం, దుబారా ఖర్చు చేయకుండా ఉండడం, ఉన్నదానితో తృప్తిపడడం మొదలగు సుగుణ సంపత్తి వారికి కలిగేలా చూడాలి. దీని కోసం ప్రతి సాధనాలను ఉపయోగించాలి. ఏపాటి అలక్ష్యం సంతానాన్ని పరాభవం పరాజయం పాలు చేస్తుంది ఇహపరాలలో వారు రెంటికి చెడిన వారవుతారు. ఒక మాట. దైవం కరుణామయుడు మరియు దయామయుడు. ప్రతి ఒక్కరికి సౌలభ్యం చేకూర్చాలనే తలుస్తాడు. కష్టాల నుంచి రక్షిస్తాడు. మోయలేని బరువు బాధ్యతలు ఏ మనిషిపై వేయడు. అందుచేత,సంతానం శ్రేయాన్ని కోరే ప్రతి వ్యక్తి ఎన్ని పనులున్నప్పటికి సంతానానికి శిక్షణ మంచి పద్ధతిలో ఇవ్వాలి. హజ్రత్ లుఖ్మాన్ తన కుమారు నికి ఇచ్చిన హితబోధలో పై వివరాలన్నింటినీ సమీకరించి అందరికి అర్థ మయ్యేలా మనోజ్ఞంగా చెప్పబడింది. *(లుఖ్మాన్- 13-19)*

లుఖ్మాన్ తన కుమారునికి హితబోధ చేసిన విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకో. అప్పుడు అతను ఇలా అన్నాడు. "కుమారా! దేవునికి భాగస్వాము

లుగా ఎవరినీ చేర్చకు, నిజం ఏమిటంటే, ఇతరులకు దేవునికి భాగస్వాములుగా చేర్చటం పరమదుర్మార్గం"- మానవుడు తన తల్లి దండ్రుల హక్కును గుర్తించాలని స్వయంగా మేమే అతనికి నిర్దేశించాము. అతని తల్లి బలహీనతపై బలహీనతను సహించి అతనిని తన కడుపున మోసింది. అతను పాలు విడిచి పెట్టటానికి రెండు సంవత్సరాలు పట్టింది(ఇందుకే మేము అతనికి ఇలా బోధించాము)" నాకు కృతజ్ఞుడవై ఉండు, నీ తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపు. నా వైపునకే నీవు మరలి రావలసి ఉన్నది. ఒక వేళ నీవు ఎరుగని వారి నెవరినైనా నాకు భాగస్వామిగా చేర్చు అని వారు నిన్ను బలవంతం చేస్తే, వారి మాటను ఏమాత్రం వినకు, ప్రపంచంలో వారి పట్ల సద్భావంతో మెలగుతూ ఉండు; కాని నా వైపునకు మరలిన వ్యక్తి మార్గాన్నే అనుసరించు. తరువాత మీరందరూ నా వైపునకే మరలవలసి ఉంది. అపుడు నేను మీకు తెలుపుతాను మీరు ఎలాంటి పనులు చేస్తూ ఉండేవారో,

(లుఖ్మాన్ ఇలా అన్నాడు) "కుమారా! ఒక వస్తువు, అది ఆవగింజంతటిదైనప్పటికీ అది కొండరాయిలోగాని, ఆకాశాలలోగాని, భూమిలోగాని, ఎక్కడ దాగి ఉన్నప్పటికీ, అల్లాహ్ దానిని బయటికి తీసుకువస్తాడు. ఆయన సూక్ష్మగ్రాహి మరియు సర్వజ్ఞుడు, కుమారా! నమాజును స్థాపించు, మంచిని ఆజ్ఞాపించు, చెడు పనుల నుండి నిరోధించు, ఏ కష్టం కలిగినా దానికి సహనం వహించు. ఈ విషయాలు ఎంతో గట్టిగా ఆజ్ఞాపించబడిన విషయాలు. ప్రజలతో ముఖం ప్రక్కకు త్రిప్పి మాట్లాడకు, భూమిపై నిక్కుతూ నడవకు. అహంభావి, బడాయికోరు అయిన ఏ వ్యక్తినీ అల్లాహ్, ప్రేమించడు. నీ నడకలో సమమైన తూకం పాటించు, నీ కంఠస్వరాన్ని కొంచెం తగ్గించు, అన్ని స్వరాలకంటే అతి చెడ్డ స్వరం గార్దభాల స్వరం."

- : సమాప్తం : -